# పగటి వేషాలు

## నిడదవోలు మాలతి

**పాత్రలు**

రామారావు — జిల్లా జడ్జి.

శాంతమ్మ — జడ్జిగారి భార్య. మహిళా సమాజం సభ్యురాలు.

సావిత్రి — జడ్జిగారి కూతురు. బి. ఎ. చదువుతూంది ఆధునికంగా అలంకరించుకుని ఉంటుంది. వయస్సు 18 సంవత్సరాలు.

మల్లికార్జునరావు — జడ్జిగారి కొడుకు. ఎస్. ఎస్. ఎల్. సి. చదువుతున్నాడు. వయస్సు 16 సంవత్సరాలు. దృఢకాయుడు. బస్కీలు తీసిన శరీరం. తానొక అభినవ కింగ్‌కాంగ్‌నని అభిప్రాయం.

ఇద్దరు. ఇతరులు. వారి వయస్సు 20, 25 మధ్య. పంచెలు కట్టుకుని పొడుగు చేతుల కమీజులు వేసుకుంటారు. తలపాగా, జరీ కండువాలు.

**స్థలం**

జడ్జిగారి ఇంట్లో డ్రాయింగ్ రూమ్. సోఫాసెట్, ఫ్లవర్ వేజ్, టెలిఫోన్ మొదలయిన పరికరాలతో అధునాతనంగా అలంకరింపబడి ఉంటుంది. ఒక మూల రేడియో ఉంటుంది.

మధ్యాహ్నం 3 గంటలు.

**రామారావు** ఏదో లా పుస్తకం తిరగేస్తూ ఉంటాడు. సావిత్రి ఒక డెకొరాన్ బ్లౌజ్ చేతులకు కూర్చి పోస్తూ లోపలినించి వస్తుంది. వెనకే శాంతమ్మ వస్తుంది, రామారావుకు కాఫీ, టిఫిన్ పట్టుకుని.

శాంతమ్మ: మీ మాటమీదే కాని ఇవతలివాళ్ల మాట వినిపించుకోరు. ( విసురుగా టీపాయ్‌మీద కాఫీ, టిఫిను పెడుతుంది. )

రామారావు: (తలఎత్తి శాంతమ్మ వేపు చూస్తూ) "మీ మాట మీదే కాని ఇవతలివాళ్ల మాట వినిపించుకోరు." అంతేనా? వినబడుతూనే ఉంది.

శాంత: (కోపంగా) వినబడితే సరేలెండి. సావిత్రీ, మీ నాన్నగారికి మంచినీళ్లు తీసుకురా.

(సావిత్రి తల వంచుకునే, చేతిలో వస్తువులు సోఫామీద పడవేసి లోపలికి వెళ్లిపోతుంది, మొహంలో కోపం వచ్చినట్టు తెలియజేస్తూ.)

శాంత: అయినా నాకేం కొత్త గనకనా? ఇరవై ఏళ్లనించి చూస్తున్నా.

రామా: శాంతా! నీ ధోరణి నాకూ కొత్తకాదు. నా ధోరణి నీకూ కొత్తకాదు. ఇక్కడ ఎవరూ కొత్తవాళ్లు లేరు. ఎందుకు వచ్చిన గొడవ ఇదంతా?

శాంత: పెళ్లి నారిటీతీరిన కూతురికి ఇంట్లో ఆమాత్రం స్వేచ్ఛ లేకపోతే ఎలాగ అని అడుగుతున్నాను. అదే మగవాడైతే మీరు 'ఇలా అడ్డు చెప్పేవారా?' అని అడుగుతున్నాను.

రామా: (విసుగ్గా) శాంతా! తల్లివై ఉండి, దానికి బుద్ధి చెప్పవలసింది పోయి . . . .

శాంత: నేను తల్లినైతే మీరు తండ్రి కాదూ?

రామా : మాట తప్పించేస్తున్నావు. ఇదే కోర్టు అయితే ప్రాసిక్యూషన్ అభ్యంతరం చెప్పి ఉండేది.

శాంత: చాల్లెండి.

రామా: ఆ అభ్యంతరం నిలిచి ఉండేది కూడా.

శాంత: ( సౌమ్యంగా సాధించాలని) అది కాదండీ. ఒక్కగానొక్క ఆడపిల్ల. రేపు పొద్దున్న పెళ్లయి అత్తారింటికి వెళ్లిపోతే, మీకు మాత్రం అనిపించదూ ఈమాత్రపు కోరిక తీర్చలేక పోయామే అని?

రామా: (దృఢమైన స్వరంతో) మే గాడ్ ఫర్ బిడ్. నిన్న మొన్నటిదాకా వీధుల్లో అల్లాయి పదాలు పాడుతూ తిరిగిన పిల్లట! ఆ పిల్ల రెండుమార్లు తెరమీద కనిపించినంత మాత్రాన, ఈ ఊరు వచ్చినపుడు మనింట్లో డిన్నర్ ఏర్పాటు చెయ్యలేదని విచారించే రోజు నా జీవితంలో రాదు. తెలిసిందా?

(సావిత్రి మంచినీళ్ల గ్లాసు తెచ్చి తండ్రి బల్లమీద పెట్టి, మళ్లీ బ్లౌజ్ తీసుకుంటుంది.)

శాంత: పైకి వచ్చే ఆడవాళ్లని చూస్తే పడక పోవడం జాతిలక్షణం మరి. ( రుసరుసలాడుతూ లోపలికి వెళ్లిపోతుంది.)

(ఒక నిమిషం ఎవరూ మాట్లాడరు.

(సావిత్రి కుట్టడం పూర్తి అవుతుంది. చెప్పనా, మాననా అని సంశయిస్తూ తండ్రివేపు చూస్తుంది.)

సా: (మెల్లిగా) నాన్నా!

రామా: (తలఎత్తి, మందహాసంలో మంచితనం ప్రదర్శిస్తూ) ఊఁ ?

సా: (ఒక క్షణం తటపటాయించి) ఈ ఒక్కసారికీ క్షమించు, నాన్నా!

రామా: ( మంచితనంగానే) నే చెప్పే ఒక్క మాట వింటావా, సావిత్రీ? జిల్లా జడ్జిగా నాకొక అంతస్తు ఉంది అందరిలోను. అదినేను నిలబెట్టుకోవాలి. ఈ విషయం మీ అమ్మకి అర్థం కాదు. నువ్వైనా ఆలోచించక్కర్లేదూ ? దేవదాసీలని వీధిగాయకుల్ని తెచ్చి నువ్వు ఇంట్లో పెడితే, వాడెవడో సాటి వీరులంటూ బజారు సరుకు తెచ్చి కొంపలో పెడితే, నేను తలఎత్తుకు తిరగాలా? రేపు పొద్దున్న నిన్ను చూడడానికి పెళ్లివారు వస్తారని రమణమూర్తి వ్రాశాడు. వాళ్లేం అనుకుంటారు?

సా: (ఆఖరి వాక్యం విని ఉలిక్కిపడి) పెళ్లివారు వస్తున్న సంగతి నాకు తెలియదు!

రామా: ఏదీ? చెప్పనిస్తేనా?

సా: అమ్మకి కూడా తెలియదనుకుంటాను.

రామా: అది నీకన్నా చిందులు తొక్కుతూంది.

సా: సరే, నాన్నా. మమ్మల్ని ఏం చెయ్యమంటారో మీరే చెప్పండి. తారని ఇక్కడికి డిన్నరుకి రమ్మనమని పొద్దున్నే మర్యాదగా కబురు చేశాం అమ్మా, నేనూను.

రామా: ఊఁహూఁ!

సా. (తండ్రి వేపు చూడకుండా గబగబా చెబుతుంది)అవును, నాన్నా! తార సన్మాన సంఘం కార్యదర్శిట పొద్దున్న ఇక్కడికి వచ్చాడు. తార తనకి బాగా తెలుసునని చెప్పాడు. ఈవేళ సాయంత్రం తార సన్మాన సభకి అమ్మ అధ్యక్షత వహిస్తూంది. తారని పరిచయం చేసుకోడానికి ఇంతకంటె మంచి అవకాశం దొరకదనిపించింది. అమ్మతో చెప్పాను. నాకు నాటకాల్లో వెయ్యడం సరదా. కాలేజీలో మొన్న బహుమతి కూడా వచ్చింది. నాకు సినిమాలో వెయ్యాలని ఉంది.

రామారావు: (ఇంతసేపూ ఆశ్చర్యంగా సావిత్రి వేపు చూస్తున్నవాడు, కఠినంగా) సావిత్రీ!

సావిత్రి (తండ్రి వేపు చూడకుండానే) అవును, నాన్నా! తార ద్వారా ఒక్క సినిమాలో నటించ గలిగితే . . . . .

రామారావు: (హేళనగా) జన్మ ధన్యమైనట్లు భావిస్తావనుకుంటాను.

సావిత్రి: (తండ్రి మాట వినిపించుకోకుండా) ఒక్క సినిమాలో నటిస్తే సరదాకి. ఆ తరవాత మీరు చెప్పినట్టు పెళ్లి, సంసారం, (వెటకారంగా) ఆయన ఆఫీసూ,అబ్బాయిల చదువులూ, అమ్మాయిల పెళ్లిళ్లూ . . .

రామారావు: సావిత్రీ! నోరు మూస్తావా? లేదా? ఇక



సుందరాంగి

ఫోటో—కె. వి. రామమోహనరావు (భువనేశ్వర్)

# పగటి వేషాలు

చాలించు! శాంత ఆధ్వర్యంలో నీ వేషాలు మీరడం చూస్తూనే ఉన్నాను. కాని ఇంత దూరం మీరిపోయావనుకో లేదు! ఛీ, ఛీ! సిగ్గుచేటు!

సావిత్రి: (తండ్రి ఆగ్రహానికి భయపడుతుంది.)

రామారావు: (కూతురు భయ పడడం చూసి తగ్గి) నామాట వినమ్మా! నామీద దయ ఉంచి అలాంటి ఆలోచనలు కట్టిపెట్టు. వెళ్ళు.

సావిత్రి: (తండ్రి తగ్గడంతో, ధైర్యం తెచ్చుకుని) ఒక్కమారు, నాన్నా. నాజీవితంలో నేను మిమ్మల్ని ఏమి అడగలేదింతవరకూ. ఇహ ముందు అడగబోను. ఒక్క ఛాన్సు తీసుకోనివ్వండి.

(మల్లికార్జునరావు రామారావు వెనకనించి ప్రవేశిస్తాడు. తలకూ, కుడి చేతికీ కట్లు ఉంటాయి.)

మల్లి: ఏమిటే ఛాన్సు అంటున్నావు?

రామా: (వెనక్కు చూసి) అదేమిట్రా? ఆ కట్లేమిటి?

మల్లి: బాక్సింగు, నాన్నా. శోభనాచలంగాడు ఛాలెంజ్ చేశాడు. టూ రౌండ్స్‌లో చితక గొట్టానండీ, సున్నంలోకి ఎమిక లేకుండా. చచ్చు వెధవ! దణ్ణం పెట్టేశాడు!

రామా: (సూటిగా చూస్తూ) ఒక్క మొగ వెధవ్వి ఉన్నావు కదా? నిన్ను ఇంజనీరింగు చదివిద్దాం అనుకున్నాను. కాని,నువ్వుమటుకు కాలూ చెయ్యీ తిన్నగా ఉంచుకునేలా లేవు.

మల్లి: నాన్సెన్స్, నాన్నా. నా చెయ్యి విరగగొట్ట గలిగినవాడు ఇంకా పుట్టలేదు. ఇలాటి చిన్న చిన్న దెబ్బలు, ఐ డోంట్ కేర్!

సావిత్రి: ఈ ఒక్కమాటుకే, ఇంకెప్పుడూ అడగను.

రామా: (వేసారిన స్వరంతో, వెనక్కు జేర్లబడి) నీకెలా చెప్పాలో నాకర్థం కావడం లేదు. వంశ ప్రతిష్ఠకి కళంకం తీసుకురాకు. ఈ ఇంట్లో పుట్టినందుకు గర్వించు అంటున్నా.

సావి: (దుఃఖం, అసమర్థత ముప్పిరి గొనగా) అవును. ఇంత గొప్ప వంశంలో పుట్టినందుకు నేను గర్విస్తాను. నేను ఒక్క అల్పమైన కోరిక కోరినందుకు మీరు సిగ్గుపడుతున్నారు. అంతేకదూ! ఏం చెయ్యను? పుట్టడం నా చేతుల్లో లేకపోయింది మరి. (గబగబా లోపలికి వెళ్ళిపోతుంది.)

మల్లి: ఏమిటీ! సావిత్రి స్టార్ కావడం కల్ల అయిపోయింది. అయితే మాస్టర్ మల్లు ప్రొడ్యూసర్ డైరెక్టర్ కావడం కూడా హుళక్కే!

రామా: సంతోషించాం గాని, లోపలికి వెళ్ళి, ఆ సన్మాన సంఘాలూ, అధ్యక్షత వహించడాలూ కట్టిపెట్టమన్నానని మీఅమ్మతో చెప్పు. రేపు పొద్దున్న సావిత్రిని చూడడానికి పెళ్ళివారు వస్తున్నారు. ఆ ఏర్పాట్లేవో చూడమని చెప్పు. ఆ సన్మాన సంఘం కార్యదర్శి ఎవడో వాడితోకూడా ఈవిడ గారు అనివార్య కారణాలవల్ల సభకి రావడం లేదని అఘోరించి రా.

మల్లి: ఓ ఎస్. (రెండు అడుగులు లోపలికి వేసి, మళ్ళీ వెనక్కు తిరిగి) నాన్నా! 'అదేం కుదరదు. నేను మాట ఇచ్చి తప్పను. సభకి వెళ్ళి తీరతాను' అని అమ్మ అంటే?

రామా: నేను చెప్పినట్టు చెయ్యవోయ్, అతి తెలివి ప్రదర్శించక.

(మల్లికార్జునరావు లోపలికి వెళ్ళి రెండు నిమిషాలు అయ్యాక మళ్ళీ వస్తాడు.)

మల్లి: నే చెప్పలేదూ, నాన్నా? అమ్మ నన్నే తిడుతూంది. ఏమైనా సరే తను వెళ్ళవలిసిందేనట! సావిత్రేమో ఏడుస్తూంది. మీరు సరేననండి. దాని కాళ్ళు విరగ గొడతాను. నాలుగు యుగాలకీ నాలుగు ఉపాయాలు చెప్పారు, నాన్నా. కలికాలంలో 'దండం పరమౌషధమ్.'

రామా: అయిందా?

మల్లి: (నాలిక కొరుక్కుని) ఇప్పుడేం చెయ్యమంటారు?

రామా: నువ్వు చెయ్యవలిసిన పనులు ఇదివరకే చెప్పాను.

మల్లి: అమ్మ రాదని ఆ కార్యదర్శికి చెప్పిరానా మరి?

రామా: అనే చెప్పాను.

మల్లి: అమ్మ వెళ్ళితీరతానంటూంది.

రామా: నువ్వు ముందు ఇక్కణ్ణించి కదిలి నేను చెప్పినట్టు చేసి వస్తావా? లేదా?

మల్లి: మధ్య నేనేం చేశాను, నాన్నా? అక్కడ అమ్మచేత చీవాట్లు, ఇక్కడ మీచేత చీవాట్లు, ఇప్పుడు ఇక కార్యదర్శి దగ్గిర ఎలాగా తప్పవు, ఆఖరి క్షణంలో ఈ వార్త మోసుకు వెళుతున్నందుకు నా కర్మ.

(అవతలి నుంచి "మల్లికార్జునరావ్" అని ఎవరో పిలుస్తారు. అతడు వీధిలోకి వెళతాడు.

(రామారావు నిట్టూర్చి పుస్తకం తీసుకుంటాడు.

(రెండు నిమిషాలు విరామం.

(మల్లికార్జునరావు "నాన్నా, అమ్మా, సావిత్రీ" అంటూ కేకలు వేస్తూ వస్తాడు. ఆ కేకలకు శాంతమ్మ, సావిత్రి లోపలినించి వస్తారు "ఏమైందిరా?" అంటూ.)


రామా: ఏమిట్రా ఫైర్ అలారమ్ కన్నా ఎక్కువగా అరుస్తున్నావు?

మల్లి: ఫైర్ కాదు, నాన్నా, వాటర్! వాళ్ళు మన ప్లానుల మీద నీళ్ళు చల్లారు! సన్మాన సభా లేదుట! ఏమీ లేదుట!

రామా: ఒరేయ్ తిన్నగా చెప్పు.

శాం: ఏమిటయిందిరా?

సా: వెధవకి మాటలు కూడా సరిగా రావు.



మల్లి: సూక్ష్మంగా, చివరి వ్యవహారం బెసిగిపోయింది!
(సావిత్రికి 'నీపని అయిందా?' అన్నట్టు సంజ్ఞ చేస్తాడు.)

రామా: సూటిగా చెప్పవోయ్.

మల్లి: తారా లేదుట, సన్మాన సభా లేదుట, నాన్నా. నా స్నేహితుడు వచ్చాడు. అదేచోట ఈపూట ఆర్. ఎస్. ఎస్. వాళ్ల సభ ఏదో ఉందిట.

శాం: సరిగ్గా కనుక్కున్నావురా?

మల్లి: ఇదిగోనమ్మా, ఆహ్వానం కూడా ఇచ్చాడు.

శాం: (ఆహ్వానం అందుకుని చూసి) మరి పొద్దున్న వచ్చిన కార్యదర్శి?

మల్లి: అదే నేనంటే నాస్నేహితుడు 'తారా లేదు, గోరా లేదు, మీరు కాజా తిన్నారు' అన్నాడు.

శాం: నీ మొహం. పొద్దున్న నేనూ, సావిత్రీ వెళ్లి తారతో మాట్లాడి వచ్చాం.

రామా: (ఈ కొత్త సంగతేమిటన్నట్టు శాంతవేపు, సావిత్రి వేపు చూస్తాడు. సావిత్రి తండ్రి చూపులు తప్పించుకోడానికి టేబిల్ మీద ఉన్న పత్రిక తీసుకుంటుంది.)

మల్లి: లేదమ్మా! అంతా మోసమేనట!

శాంత: అసంభవం. ఆ కార్యదర్శి మోసగాడులా కనిపించ లేదు.

మల్లి: నిజమైన మోసగాళ్లందరు అంతేనమ్మా. మోసగాళ్లలా కనిపించరు.

శాం: (మనస్సులో భయం ప్రవేశించగా) చాలా పెద్ద మనిషిలా మాట్లాడాడురా! సభలో వెయ్యడానికి మంచి టేబిల్ క్లాత్ లేదు అంటే మన కాశ్మీర్ శాలువా ఇచ్చాను. సభ అయిపోగానే స్వయంగా వచ్చి తెచ్చి ఇస్తానన్నాడు.

సా: (భయంగా తండ్రి వంక చూస్తూ) నేను నా గదిలో ఉన్న ఫ్లవర్ వేజ్‌లు ఇచ్చాను.

శాం: అదెప్పుడు?

సా: అదేనమ్మా, నువ్వు లోపలికి వెళ్లిపోయాక కొంత దూరం వెళ్లి మళ్లీ వెనక్కి వచ్చాడు.

రామా: హుఁ. నాకు తెలియకుండా చాలా సంగతులు జరిగాయన్నమాట! (కొడుకువేపు తిరిగి) నువ్వేం సమర్పించుకున్నావురా?

మల్లి: నేనేం ఇవ్వలేదు నాన్నా. ఎనిమిది రూపాయలు మటుకు ఇచ్చాను.

సా: ఏం ఇవ్వలేదంటావేం?

మల్లి: నేనేం ఇంట్లో సామానులు దోచి ఇచ్చెయ్య లేదుగా?

రామా: ఉద్ధరించావులే.

శాంత: డబ్బు ఎందుకు ఇచ్చావురా?

మల్లి: ఏం చెయ్యనమ్మా? టాక్సీలో వచ్చాడు. నూరు రూపాయల నోటుకి చిల్లర లేదుట. 'నీ దగ్గిర ఉందా?' అని అడిగాడు.

సా: నువ్వేమో దర్జా ఒలకబోస్తూ టాక్సీ ఛార్జి ఇచ్చేశావు.

మల్లి: లేకపోతే 'మా నాన్నగారు నాకు నెలకి పది రూపాయలు మాత్రమే ఇస్తారు జేబు ఖర్చుకి. అందులో పావలా పెట్టి జీడిపప్పు కొనుక్కున్నాను, అర్ధ రూపాయి అప్పు ఇచ్చాను' అంటూ చిట్టా ఆవర్జాలు వల్లెవెయ్యమన్నావా వాడి ముందు?

శాం: (రామారావుతో) అవునండీ, నా కిప్పుడు తట్టుతూంది. 'మీటింగ్ అయిదుకి అంటే అయిదుకే ప్రారంభం కాకపోవచ్చు. నేను రావడం ఆలస్యం అయితే మీరేమీ గాభరా పడకండి' అన్నాడు.

సా: నాతో కూడా 'మీరు వట్టి అమాయకుల్లా ఉన్నారు' అన్నాడమ్మా.

రామా: (హేళనగా) ఏం మల్లూ! నీతో కూడా

# పగటివేషాలు

ఏదో అనే ఉండాలే!

మల్లి: అవునవును. నాతో కూడా అలాంటిదే ఏదో అన్నట్టే జ్ఞాపకం. నాకసలు అప్పుడే అనుమానం వేసింది కూడాను— వీడెవడో శ్రీ ఫోర్ ట్వెంటీలా ఉన్నాడని.

శాం: ఉహుఁ. 'అనుమానం వేసింది కూడానూ' అంటూ సాగనియ్యకపోతే అప్పుడే నిలవేసి నాలుగూ అడగరా?

మల్లి: అన్ని విధాలా ఆలోచించానమ్మా. ఒకవేళ అతను అవారా కాకపోతే 'అయిన పెద్ద మనిషిని అలా అవమానిస్తావా?' అని నువ్వు తాషామర్పా మోగిస్తావేమోనని ఊరుకున్నాను.

(రామారావు కోపంగా పుస్తకం తీసుకుంటాడు.)

శాం: అదేమిటండీ! అది ఎవరి సంగతో అన్నట్టు మాట్లాడరు?

రామా: నా కెప్పుడు అవకాశం ఇచ్చావని మాట్లాడడానికి?

మల్లి: అమ్మా! నువ్వు సరేనను. వాళ్లు ఎక్కడ ఉన్నారో వెళ్లి లాక్కువచ్చి నీకు క్షమాపణ చెప్పిస్తాను— రెండు నిమిషాలలో.

సా: మరే, నీకోసం వాళ్లక్కడ ఎదురుచూస్తూ కూచుంటారు!

శాం: అలా అని ఊరుకుంటారా? పోలీసులకి ఫోను చెయ్యండి.

మల్లి: (ఫోన్ దగ్గిరికి వెళుతూ) నేం చెయ్యనా?

రామా: మల్లూ! ఆ ఫోను అక్కడ పెట్టి నువ్వు ఇవతలకి రా. జరిగిన భాగవతానికి పబ్లిసిటీ కూడా కావాలేమిటి? పేపర్‌లో కూడా వేయించాలా, బాక్స్ కట్టి? వెళ్లండి. తూర్పుగా తిరిగి 'కృష్ణార్పణం' అనుకుని నోరు మూసుకోండి. ఛ ఛ!

ప్రార్థన

చిత్రం — బి. పద్మయ్య (మిరియాంగూడా)



(విసుగ్గా పుస్తకం తీసుకుంటాడు.

(ఇద్దరు వ్యక్తులు వీధివేపు నించి ప్రవేశిస్తారు.)

ప: వే: నమస్కారం బాబూ!

రామా: ఎవరు మీరు?

1 ప. వే: మేం పగటి వేషగాళ్లం దొరా! ఉదయం అమ్మగారి దర్శనమయింది. కాని, తమర్ని ఇప్పటివరకూ దర్శించుకోలేకపోయాము.

శాం: ఏమండీ మన శాలువా!

1 ప. వే: మీదేనమ్మా. ఇదిగో. (శాలువా, ఫ్లవర్ వేజులు టేబిల్ మీద పెట్టడానికి ముందుకు రాబోతారు.

(కొడుకు అంతలో వాళ్లమీదికి కొదవ సింగంలాదూకి మొదటి వేషగాడి కాలరు పుచ్చుకుంటాడు.)

మల్లి: యూస్కౌండ్రల్స్! పర్మిషన్ ఇయ్యి, నాన్నా. వీళ్లిద్దర్నీ మళ్లీ లేవకుండా చావ గొడతాను. ఒక్కటే దెబ్బ!పది క్షణాలు చాలు!

1 ప. వే: (నవ్వుతూ) కోపగించకండి, బుల్లి దొరా! మీ వస్తువులతో మేము పరారీ కాలేదు. మా విద్య ప్రదర్శించి బహుమానాలందుకోడానికి వచ్చాము. ఆదరించవలసిన ప్రభువుః ఆగ్రహిస్తే మేం మనగలమా? ఇవిగో, మీ శాలువా, ఫ్లవర్ వేజులూ; ఇవిగో మీ ఎనిమిది రూపాయలూ.

రామా: మల్లూ! నువ్వా కాలరు వదిలి ఇవతలకి రా.

మల్లి: (డబ్బు తీసుకుని అసంతృప్తిగా కాలరు వదిలేస్తాడు) ప్చ్. ఛాన్సు పోయింది.

రామా: అయితే పొద్దున్న కార్యదర్శినంటూ వచ్చింది నువ్వేనా?

1 ప. వే: అవునండీ. తారగా తమతో పరిచయం చేసుకున్నవాడు వీడే.(రెండవవాణ్ణి చూపిస్తాడు.)

శాంత: ఆఁ! ఓరి నీ ఇల్లు బంగారంగానూ!

సావిత్రి: నిజమే!

1 ప. వే: సీత, చిత్రాంగి, సావిత్రి, మండోదరి, దుర్యోధన, కర్ణ, కృశ్చేవ్, మీనన్ మొత్తం ముప్ఫైయారు వేషాలు కట్టి మీవంటి పెద్దల ముందు అవుననిపించుకున్నాడు. అరవం, మళయాళం, మరాఠీ, కన్నడం, బొందిలీ వంటి పదకొండు భాషలు మంచి నీళ్లలా మాట్లాడగలడు. మీ వంశం దాతల వంశం అని తెలిసి వచ్చాం.

శాం: (అప్రసన్నంగా) మల్లూ, ఓ రూపాయి ఇయ్యి. (ప. వే. తో) తీసుకుని పొండి! ఇంకెప్పుడూ ఇలా రాకండి!

మల్లి: (రూపాయి తీసి ఇస్తాడు.)

2 ప. వే: (అది పుచ్చుకోకుండా) ప్రభువులది ఘనమైన వంశం. (రామారావుతో) మీ తండ్రిగారు 'కట్టుకుని భోజనం చెయ్యడానికి లేదంటే', 'తీసుకోరా' అని పట్టుపంచె ఇచ్చారు. ఆ చెట్టు మొలక అని మిమ్మల్ని ఆశ్రయించాం. మా విద్య గుర్తించి గౌరవిస్తారని వచ్చాం. పరువుగా

మెరిగారు. బరువుగా సత్కరిస్తా రని ఆశించాం. దొరగారి పాతకోటు ఏదైనా ఉంటే ఇప్పించండి.

రామా: (సంతోషంగా) ఇప్పుడు కోట్లు ఏమి లేవుగానీ, ఇది పట్టుకుపొండి! ( వాళ్ల తీసుకువచ్చిన శాలువా వాళ్లకు ఇస్తాడు.)

2 ప. వే: (అది అందుకుని ) దొడ్డ ప్రభువులు! ఆ మహరాజుకి తగిన కొడుకు అనిపించుకు న్నారు ఊరూరా మీ పేరు చెప్పుకుంటాము. దయ ఉంచండి. వస్తాం. (దణ్ణాలు పెట్టు కుంటూ నిష్క్రమిస్తారు.)

శాం: పగటి వేషాలేమిటి? దొంగ వేషాలు! ఆ శాలువా కోసం ఈ ఎత్తు వేశారు! దొంగ వెధవలు!

రామా: పోనీలే, శాంతా, మనకంటె వాళ్ళే నయం. కనీసం వేషగాళ్లం అని నిబ్బరంగా చెప్పుకో గలుగుతున్నారు.

శాం: చాల్లెండి. నిక్షేపంలాటి శాలువాకి నీళ్లధార అయింది.

మల్లి: పోన్లే అమ్మా! ఊరూరా చెప్పుకు తిరుగుతాం అంటున్నారుగా? అది చూసిన వాడెవడైనా సావిత్రిని చేసుకుంటానని రావచ్చు.

సావిత్రి: నోరు ముయ్యి. స్టుపిడ్! (లోపలికి వెళ్లి పోతుంది.)

రామా: (లేస్తూ) సరే. నేనలా క్లబ్‌వేపువెళ్లి వస్తాను. రేపు వచ్చే ఆ పెళ్లివారి కోసం ఏర్పాట్లు ఏం కావాలో చూడు. బజారునించి ఏమైనా కావలిస్తే మనవాణ్ణి తెమ్మను.

(రామారావు వీధివేపు రెండడుగులు వేస్తాడు. మల్లి కార్జునరావు "ఓకే" అంటూ లేస్తాడు. శాంతమ్మ వంటఇంటివేపు వెళ్లబోతూంటుంది. కొడుకు హఠా త్తుగా, "నాన్నా!" అని కేక వేస్తాడు. ఎక్కడి వాళ్లక్కడ ఆగిపోతారు.)

మల్లి: నాన్నా! ఆ పెళ్లికొడుకు కూడా పగటి వేషగాడేమో ?

శాం: అవునండీ. నాకు తోచనేలేదు. తెలివి తక్కువదాన్ని.. ఈమారైనా సరిగ్గా కను క్కోండి. ఎవరైనా వింటే అప్రతిష్ఠ కూడాను.

రామా: (శాంతతో) ఈ విధంగానైనా నీ తెలివి తక్కువతనాన్ని గురించి, ప్రతిష్ఠని గురించి విచారిస్తున్నావు. అంతేచాలు. నన్ను నువ్వు హెచ్చరించనవసరం లేదు. కానీ, ముందుకావలసినవేవో చూడు. (కొడుకుతో) బుద్ధిమంతుడివి. ముందే చెప్పావు, రేపు పొద్దున్న ఆ పెళ్లికొడుకుని కొడతాను, పొడుస్తాను అంటూ హడలగొట్టకుండా. నీ జ్ఞాన విశేషాలు తేటతెల్లమే. వెళ్లి పని చూడు. (మల్లి మౌనంగా శాంతను అనుకరి స్తాడు.) అంతా కలిసి కొంపలో పెద్ద మనిషి అన్నవాడు కాలు పెట్టకుండా చేస్తున్నారు. ఛ ఛ!

[తెర]



తేనె జుర్రుతున్న వేళ

ఫోటో—కె. రామకృష్ణారావు (చిత్రరంజన్)